క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలి



పట్టణ సీఐ మురళీధర్

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్క ద్విచక్రవాహన దారు హెల్మెట్‌ను విధిగా ధరించాలని పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్‌కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌లు లేని కారణంగా రెండు రోజుల క్రితం పట్టణంలో యాక్సిడెంట్ అయి ఒకరు మృతిచెందారని తెలిపారు. పట్టణంలో పెరిగిన రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. హెల్మెట్ వాడకం, రహదారి భద్రత నియమాలను పాటించాలని, క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే వారిపై జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి



తరలిస్తున్న సేంద్రియ ఎరువు

సీతానగరం: సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి తోడ్పడాలని ఈఓపీఆర్‌డీ కుమార్ వర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తలను పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువుగా తయారు చేయనున్నట్లు చెప్పారు. తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీల నిధులను పెంచనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు



పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించామన్నారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లయితే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అంటిపేటలో కల్వర్టు నిర్మాణం



నిర్మాణంలో ఉన్న కల్వర్టు

సీతానగరం: మండలంలోని అంటిపేటలో మండల పరిషత్ నిధులతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. గ్రామం నుంచి కాలనీకి వెళ్లే రహదారి పరిధిలో కల్వర్టు నిర్మాణం కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీ వాసులు రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను గుర్తించిన స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఎస్.నిర్మల మండల పరిషత్ నిధులతో కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కల్వర్టు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే అంటిపేట నుంచి కాలనీకి వెళ్లేందుకు అవస్థలు తప్పుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

స్త్రీ నిధి రుణాలు చెల్లించాలి..

భామిని: వెలుగు సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇచ్చిన స్త్రీ నిధి రుణాలను క్రమపద్ధతిలో చెల్లించాలని స్త్రీనిధి ఏజీఎం హైమావతి సూచించారు. వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణితో కలిసి నేరడి-బి మహిళా సంఘ సభ్యులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో వడ్డీ భారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఎస్.రాజకుమార్, సీసీ కృష్ణకుమారి, వీఓఏ భవానీ, మహిళా సంఘాల సభ్యులున్నారు.

మొదలైన హరిదాసుల సందడి

- ప్రారంభమైన సంక్రాంతి వేడుకలు



పార్వతీపురం:

మరికొద్ది రోజుల్లో సంక్రాంతి పండగ రానున్న తరుణంలో పార్వతీపురం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో హరిదాసుల సందడి నెలకొంది. ఒక చేతితో తంబుర, మరో చేతితో చెక్కలు, నెత్తిన అక్షయపాత్ర ధరించి పురవీధుల్లో కాలినడకన తిరుగుతూ నిత్యం హరినామస్మరణ చేసే హరిదాసులు పండగ వేళ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నారు. రామయ్య తండ్రికి గుడికట్టించి, సీతమ్మ తల్లికి చింతాకు పతకం చేయించి రామదాసు జైలుపాలయ్యాడు. అంతటి భక్తి తత్వాన్ని ప్రచారం చేస్తూ హరిదాసులు మన పల్లెల్లో సంప్రదాయాలు కనుమరుగవకుండా కాపాడుతున్నారు. ఏటా ధనుర్మాస ఆరంభంలో వారి సందడి ఒకప్పటి వైభవాన్నే కాకుండా మనమేంటో, మన సంస్కృతి ఏంటో, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లను గుర్తుచేస్తుంది. ఎక్కడెక్కడో పుట్టిపెరిగి దైవ నామస్మరణ చేసుకునే వారెందరికో ఈప్రాంతం నిలయంగా మారింది. కార్తీకమాసం ప్రారంభం నుంచి భోగిపండగ వరకు రాష్ట్ర నలుమూలలా దాదాపు వంద మంది హరిదాసులు రామనామస్మరణ చేసుకుంటూ పట్టణాలు, గ్రామాల్లో ప్రజల మన్ననలు, ఆదరణ పొందుతున్నారు. రామనామస్మరణ చేస్తూ వీధుల్లో తిరుగుతూ గత వైభవాన్ని గుర్తుచేస్తున్నారు. ఇలా ఊరూరా తిరిగి సేకరించిన ధనధాన్యాదులను భోగి తరువాత భద్రాద్రిలోని రామాలయంలో 25 శాతం ప్రజల తరఫున జమచేసి మిగిలిన వస్తువులను తమ జీవనానికి ఉపయోగిస్తామని హరిదాసులు చెబుతున్నారు.

రాజన్నదొర మంజూరుచేయించిన రోడ్లే

- వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: కొత్త సీసాలో పాత సారా అన్న చందాన ప్రస్తుతం సాలూరు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పరిస్థితి ఉందని వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ వ్యంగ్యంగా విమర్శించారు. ఈ మేరకు సోమవారం అయన పట్టణంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో వంద రోజుల్లో వంద రోడ్లు పూర్తిచేశామని టీడీపీ నాయకులు గొప్పగా ప్రచారాలు చేసుకుంటున్నారన్నారు. అయితే ఆ రోడ్లన్నీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి మంజూరుచేయించివనేనని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన రోడ్లలో కొన్ని గత ప్రభుత్వంలోనే నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన రోడ్లు ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మాణాలు చేస్తున్నారు తప్ప,ఈ ప్రభుత్వంలో మంత్రి సంధ్యారాణి మంజూరుచేయించి చేపట్టిన నిర్మాణాలు కాదని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి మంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ముఖ్యంగా పంచాయతీరాజ్ (పీఆర్‌ఐ,పీఐయు),ఆర్‌అండ్‌బీ,ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ద్వారా సుమారు రూ.1300 కోట్లతో 15,857 పనులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో సగానికి పైగా పనులు గత ప్రభుత్వంలో పూర్తయి ,కొన్ని పనులు నాడు వివిధ దశలలో ఉన్నాయని వివరించారు. ఇన్ని కోట్లతో ఇంత అభివృద్ధి పనులు గత ప్రభుత్వంలో చేపట్టినా ఏనాడూ రాజన్నదొర , ఆయన వెంట ఉన్న వైస్సార్‌సీపీ శ్రేణులు గొప్పగా ప్రచారాలు చేసుకోలేదన్నారు. పంచాయతీలో చేపడుతున్న పనుల్లో ,సర్పంచ్‌లతో ఆ పనులు చేయనివ్వకుండా కొందరు టీడీపీ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు జర్జాపు మోహన్, లక్ష్మణరావు, అప్పారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతే గాని పట్టించుకోరా?



సన్యాసిరాజుపేట మలుపువద్ద రోడ్డు మధ్య గోతిలో ఏర్పాటుచేసిన కర్రలు

సాలూరు: నరకప్రాయమైన రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజలు ప్రాణాలు పోతే కానీ ప్రభుత్వం పట్టించుకోదా అని పలువురు ప్రజలు వాపోతున్నారు. పెద్ద పెద్ద గుంతల్లో పడి వాహనదారులు ఏమైనా ప్రమాదాలకు గురవుతారేమోనని ఆందోళనతో స్థానిక ప్రజలు హెచ్చరిక సూచికలు ఏర్పాటుచేస్తున్నారు. సాలూరు మండలంలో సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువ రోడ్డు పూర్తి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గోతులతో నిండిన ఈ రోడ్డు గుండా ప్రజలు దాదాపు ప్రయాణాలు తగ్గించుకుంటున్నారు. సాలూరు నుంచి మక్కువ వెళ్లాలంటే దూరమైనా మామిడిపల్లి, శంబర మీదుగా ప్రయాణాలు చేస్తున్నారు. అయితే ఈ బాగువలస పరిసర ప్రాంతాల ప్రజలు తప్పనిసరిగా తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గంగుండానే ప్రయాణించాల్సి ఉంది. అయితే సన్యాసి రాజుపేట సమీపంలో రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. మలుపు కావడంతో ఏమరుపాటుగా వాహనం నడిపితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంది. దీంతో స్థానికులు ఈ గోతిలో పెద్దకర్రలను ఏర్పాటుచేసి తద్వారా ప్రమాదముందని హెచ్చరిక సూచికను ప్రయాణికులకు జారీ చేస్తున్నారు. ఈ రోడ్డులో ఉన్న గోతులలో పలువురు ప్రయాణికులు పడి చేతులు, కాళ్లు విరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

జగనన్న హయాంలోనే అభివృద్ధికి బాటలు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: వైద్యానికి అధిక ప్రాధాన్యం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే పాలకొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి బాటలు వేయటం జరిగిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రక్తనిల్వల కేంద్రం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. తాజాగా ఆ కేంద్రాన్ని ప్రారంభించడంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని చెప్పారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో పూర్తి వసతులతో కూడిన ప్రత్యేక రక్త నిల్వల కేంద్రం కోసం తాను, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కృషి చేసినట్లు చెప్పారు. నాటి వైద్యారోగ్య శాఖా మంత్రి విడదల రజని దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో పాటు 2023 మార్చి17న శాసనమండలిలో ప్రస్తావించినట్లు తెలిపారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికెట్ సాధనలో భాగంగా ప్రత్యేక బ్లడ్‌బ్యాంక్ ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో కీలకమైన బ్లడ్‌సెల్స్ సెపరేషన్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈయన వెంట ఆ పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన కార్తీక్



గాయాలపాలైన సురేంద్ర

వీరఘట్టం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సీఎస్పీ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కార్తీక్(బబ్బులు) అనే యువకుడు మద్యం మత్తులో బైక్ డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా నడుచుకుని రోడ్డుపై వెళ్తున్న సురేంద్ర అనే యువకుడిని ఢీ కొట్టాడు. దీంతో కార్తీక్‌కు తలపైన, సురేంద్రకు ముక్కుపై గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పీసా ఎన్నికల్లో 275 గ్రామాల్లో ఏకగ్రీవం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో జరిగిన పీసా ఎన్నికల్లో 278 గ్రామాలకు గాను 275 గ్రామల్లో ఏకగ్రీవం అయినట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది పీసా మండలాల్లో ఈ నెల 2 నుంచి 6 వరకు 278 పీసా గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఎన్నికలు జరగగా 275 గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. 2 గ్రామాల్లో పీసా ఎన్నికలు జరిగినట్లు తెలిపారు.

జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతరు

- గ్రీవెన్స్ సెల్‌కు హాజరు కాని మండలాధికారులు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ ఒక్కరే కనిపిస్తున్న దృశ్యం

పాచిపెంట: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా కనిపిస్తోంది. ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ గతంలో ఆదేశాలు జారీ చేశారు. కాగా ఆ పరిస్థితి పాచిపెంట మండలంలో కనిపించడం లేదు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ పాత్రో మినహా తహసీల్దార్ గానీ, మిగిలిన ముఖ్యశాఖల అధికారులెవరూ అధికారులు హాజరుకాలేదు. అధికారులు ఎవరికివారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారని చెప్పడానికి ఇది ఓ నిదర్శనమని పలువురు ప్రజలు మాట్లాడుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్న సదరు మండలస్థాయి అధికారులు ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తారని ఎలా అనుకోగలమని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

స్వరూపకు పీహెచ్‌డీ పట్టా

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు జెట్టి స్వరూపకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. అండర్ స్టాండింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ బయ్యర్ డెసిషన్, ఎ కేస్ స్టడీ ఆఫ్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై విశేష కృషికి గాను స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ వారు ఈ గౌరవం ఇచ్చారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, అధ్యాపకులంతా స్వరూపను అభినందించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

భామిని: మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 మార్చి వరకు సుమారు రూ.18.90 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులపై అధికారుల సమక్షంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ

పార్వతీపురంటౌన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, ఆర్థికేతర సౌలభ్యాలకు సంబంధించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని అనేక సార్లు హామీ ఇచ్చారన్నారు. నేటికి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి కావచ్చినప్పటికీ 1వ తేదీనాటికి జీతాలే చెల్లించకపోవడం శోచనీయమన్నారు. 13వ పీఆర్‌సీ కమిషన్ నియామకం గాని ఇంటీరియం రిలీఫ్ ప్రకటన గాని, డీఏ బకాయిలు గాని, సరెండర్ లీవుల నగదు మార్పిడి గాని, పీఎఫ్ ఏపీజీఎల్ఐ తదితర లోన్లు గానీ నేటికీ ఇవ్వకపోవడం విచారకరమని, నేటి ప్రభుత్వం మీద ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు ఎన్నో ఆశలతో ఉన్నారన్నారు. కనీసం రానున్న సంక్రాంతి కైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు తీపి కబురు అందిస్తారని ఎంతో ఆశతో ఉన్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను ఇప్పటికైనా నెరవేర్చడానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్ నియమించి, ఇంటీరియమ్ రిలీఫ్ 30శాతం తగ్గకుండా ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాల భవనం లేక విద్యార్థుల అవస్థలు



ఇరుకు రేకుల షెడ్‌లో విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి పంచాయతీ గంగన్నదొర వలస ప్రాథమిక పాఠశాలలో 27 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి పాఠశాల భవనం లేకపోవడంతో ఇరుకు రేకుల షెడ్డులోనే ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. నాడు నేడు రెండవ విడతలో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే పాఠశాల పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికలు సమీపించడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం పాఠశాల భవనం పూర్తిచేసి విద్యార్థులకు సరైన వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై పాపారావు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల మృతులలో ఎక్కువమంది మైనర్లే ఉన్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు వాహనాలు నడిపేటప్పుడు విధిగా బండి పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు, రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలి

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సహకరించాలని గిరిజన శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు మక్కువ మండలంలోని కాశీపట్నం గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డును సోమవారం మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మక్కువ మండలంలో ఇప్పటివరకు 35సీసీరోడ్లు పూర్తయినట్లు తెలిపారు. అలాగే రూ.10కోట్లతో బీటీరోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి సంధ్యారాణి వివరించారు. కేంద్రం నుంచి రూ.300కోట్లు గిరిజనశాఖకు మంజూరుకాగా, వాటిలో రూ.80కోట్లు సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులుకు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా 110 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 63అంగన్వాడీ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ.స్వరూపరాణి, తహసీల్దార్ షేక్‌ఇబ్రహీం, ఎంపీటీసీలు కోట జయమ్మ, తీళ్ల పోలినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలరావునాయుడు తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గిరిజనశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.3428కోట్లు ఫీజురియింబర్స్‌మెంట్ విడుదలచేయాలని, తల్లికి వందనం పథకం అమలుచేయాలని, మండలకేంద్రం మక్కువలో డిగ్రీ కళాశాల నిర్మించాలని కోరారు. అలాగే సాలూరు మండలం మామిడిపల్లిలో గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలను నిర్మించాలని, గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర జరిపించాలని, ఏఎన్ఎం పోస్టులు భర్తీచేయాలని, ట్రైబల్ యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు త్వరితిగతిన పూర్తిచేసేలా కృషి చేయాలని మంత్రి సంధ్యారాణిని కోరినట్లు హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు శంకర్రావు, మనీ, వికాస్, రాకేష్ పాల్గొన్నారు.

బలవంతంగా పార్టీ ఫిరాయింపులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ, పార్టీ నాయకులు

సీతంపేట: కొంతమంది రాజకీయ దళారీలు తమ పబ్బం గడుపుకోవడానికి ఒత్తిడితోనే బలంతంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, అటువంటి వారి మాటలు నమ్మవద్దని ఎంపీపీ బి. ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హిమరిక మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. సీతంపేట ఏజెన్సీలోని పలువురు సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకువచ్చి జనసేనలో చేర్పించారని ఆరోపించారు. పనులు చేపట్టడమని.. చేసిన పనులకు బిల్లులు మంజూరు కావని భయపెడుతూ కొంతమంది పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారాలని ఆ పార్టీ నాయకులు ప్రలోభాలు చేసినా ఎవ్వరూ స్పందించలేదన్నారు. ఇప్పుడు కొందరు రాజకీయ దళారీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికార కూటమి నాయకుల వద్ద మెప్పు పొందడానికి గిరిజన సర్పంచ్‌లను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పార్టీలు మారి నీతి తప్పే సంస్కృతి మా గిరిజనులకు లేదన్నారు. ఏ పార్టీలో ఉన్నా గెలిచిన తర్వాత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.తిరుపతిరావు, ఎస్.సిమ్మయ్య, రాజయ్య, కూర్మారావు, ప్రవీణ్, ఎస్.గణేష్, రవికుమార్, బాపయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎస్.చంద్రశేఖరరావు, ఎస్.మంగయ్య, గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి.చలపతిరావు, సోమేష్, వెంకి, ఎస్.షోడంగ, బి.అప్పారావు, మురళి, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.